

**జరిగిన కథ :** ఉజ్జయినిలో ఉండే మదనాంకుడు ఒక విద్యాధర కన్యతో మోహంలో పడ్డాడు. ఆమెను కలుసుకోవడం కోసం పుష్కరావతికి బయల్దేరాడు. మధ్యలో ఒక యక్షిణిని వశపరుచుకుని, ఆమె సాయంతో హిమాలయాల వరకూ వెళ్లాడు. అక్కడ ఒక స్త్రీపై మోహం కొద్దీ మర్కటరూపం పొందిన చంద్రస్వామి.. తన కథను మదనాంకుడితో చెప్పాడు. ఆ తరువాత యక్షిణి సాయంతోనే మదనాంకుడు విద్యాధర కన్యను కలుసుకున్నాడు.

కాశీ మజిలీ కథలు 97

# పాపం మగవాళ్లు

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

మదనాంకుణ్ని చూడగానే రాగవతి పరుగున వచ్చి కౌగిలించుకుంది. దానితో అతనికి బడలిక మొత్తం తీరిపోయింది. ఒక మానవుణ్ని తనతోపాటు ఇంటికి తీసుకుపోతే తల్లిదండ్రులు శిక్షించగలరని భయపడిన రాగవతి.. తన విద్యాబలంతో ఆ తోటలోనే ఒక మందిరం నిర్మించింది. అందులో మదనాంకుణ్ని ఉంచింది. ఇతరులకు తెలియకుండా రోజూ అక్కడికి రాకపోకలు సాగించింది. కొంతకాలం వారి ప్రణయం ఏ ఆటంకమూ లేకుండా కొనసాగింది.

ఒకనాడు మదనాంకుడు తాను వచ్చేదారిలో హిమాలయాల వద్ద ఒక మర్కటాన్ని చూసిన ఉదంతాన్ని రాగవతికి తెలియచేశాడు.

''అతణ్ని నువ్వు మళ్లీ మనిషిగా చేయగలవా?'' అని ప్రశ్నించాడు.

''శాకిని, డాకినిలాంటివాళ్లు అలాంటి పనులు చేస్తుంటారు. మేము చేయలేం'' అని చెప్పింది రాగవతి.

''అవునా! నా మిత్రుడు పాపం ఎన్ని కష్టాలు పడుతున్నాడో! నాకోసం పరితపిస్తూ ఉంటాడు. కనీసం నన్నోసారి అక్కడికి తీసుకుపోయి చూపించగలవా?'' అని అడిగాడు మదనాంకుడు.

''ప్రియా! నేను నీకు ఉత్పాతిని, అవతరిణి అనే రెండు విద్యలు ఉపదేశిస్తాను. వాటి సాయంతో నీకు గగనసంచార శక్తి కలుగుతుంది. నువ్వు వెళ్లి నీ మిత్రుణ్ని కలుసుకుని, మంచిచెడ్డలు విచారించి రేపటికల్లా తిరిగి రావాలి. నువ్వు లేకుంటే నేనుండలేను'' అన్నది రాగవతి.

సరేనని విద్యలు గ్రహించి.. మిత్రుని వద్దకు వెళ్లాడు మదనాంకుడు. మర్కట రూపంలో ఉన్న చంద్రస్వామిని కలుసుకుని..

''మిత్రమా! నేను అదృష్టవంతుణ్ని. రాగవతి ఎంతో మంచిది. లేకపోతే నాకు విద్యలు ఉపదేశించదు కదా! నీ విషయం కూడా చెప్పాను. పాపం చాలా జాలిపడింది కూడా'' అన్నాడు.

చంద్రస్వామి మాత్రం..

''మదనాంకా! స్త్రీల చిత్తాలు క్షణక్షణానికీ మారిపోతుంటాయి. ముఖ్యంగా ఇటువంటి సంబంధం పెట్టుకున్నప్పుడు, మనం ఎన్నో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది'' అని చెప్పాడు.

ఆ తరువాత వారిద్దరూ వేరే కబుర్లలో పడ్డారు.

మదనాంకుడు అక్కడికి వెళ్లిననాటి సాయంకాలం.. రాగవతి తలంటుకుని, గున్నమామిడి చెట్టుకింద తలార బోసుకుంటున్నది. ఆ సమయంలో రాజభంజరుడనే విద్యాధరుడు అటుపక్కగా వచ్చాడు. అతణ్ని చూడగానే సిగ్గుతో పక్కకు తప్పుకోబోయింది రాగవతి. కానీ, ఆ విద్యాధరుడు ఆమెను అటకాయించాడు.

''రాగవతీ! నువ్వేదో మానవుణ్ని వలచావని విన్నాను. ఆమాత్రం సుందరులు నీకు మన జాతిలో లభించలేదా?'' అని ప్రశ్నించాడు.

''నిన్ను చూశాక తప్పు చేశానని అర్థమవుతున్నది. నువ్వు నన్ను చేపడితే, అతణ్ని విడిచిపెట్టేస్తాను'' అన్నది రాగవతి సిగ్గుపడుతూ..

విద్యాధరుడు వెంటనే అంగీకరించాడు. అలా వాళ్లిద్దరూ ఒక్కటైపోయారు. ఆ మరునాడు చంద్రస్వామి వద్దనుంచి మదనాంకుడు వచ్చేశాడు.

రాగవతి తలుపు తీయలేదు. లోపలినుంచే..

''వచ్చినదారినే వెళ్లిపో!'' అన్న హెచ్చరిక చేసింది.

ఆ మాటతో మదనాంకుడు ర్మాన్పడిపోయాడు. కొద్దిసేపు ఆగిన తరువాత మళ్లీ తలుపు బాదాడు. విద్యాధరునితో వినోదిస్తున్న రాగవతి విసుక్కుంటూ లేచి వచ్చింది.

తలుపు తీసి, మదనాంకుణ్ని ఈడ్చి తన్నింది.

''ధూర్తమానవా! చెబుతుంటే నీక్కాదూ?! పో ఇక్కణ్నుంచి. అధికప్రసంగం చేశావంటే శపించగలను. నీకిచ్చిన విద్యలు రేపటివరకు పనిచేస్తాయి. ఈలోపుగా మీ ఊరికి చేరుకుని, సుఖంగా ఉండు'' అని చెప్పి, మళ్లీ లోపలికి పోయింది.

'స్త్రీల చిత్తాలు క్షణక్షణానికీ మారిపోతుంటాయి!' అని చంద్రస్వామి చెప్పిన మాట నెమరేసుకుంటూ.. మదనాంకుడు విచారంగా అక్కణ్నుంచి వెనుతిరిగాడు.

చంద్రస్వామి వద్దకు వచ్చి బోరున విలపించాడు.

''మిత్రమా! నువ్వు చెప్పిందే నిజమైంది. దీనికోసం కన్నతల్లిని, కట్టుకున్న భార్యను కూడా విడిచిపెట్టి వచ్చాను'' అన్నాడు.

''అయ్యయ్యో! నీకు భార్య ఉందా?! నువ్వింకా నాలాగా పెళ్లికాని వాడివే అనుకున్నాను. స్త్రీ సాంగత్యం ఎటువంటిదో తెలిసి ఉండి కూడా ఇటువంటి అనుభవాన్ని ఎందుకు కోరుకున్నావు?'' అని ప్రశ్నించాడు చంద్రస్వామి.

''ఎందుకంటే ఏమని చెప్పను?! ఆ సమయంలో